సాక్షి శ్రీకాకుళం

సోమవారం। 12। ఫిబ్రవరి। 2024



ప్రమాదాల నివారణే ధ్యేయం

డీటీసీ చంద్రశేఖర రెడ్డి 'సాక్షి'తో మాట్లాడారు. తన కార్యాచరణ వివరించారు. - 8లో



టికెట్ల విక్రయాలకు సన్నద్ధం

అరసవల్లిలో రథయాత్ర టికెట్ల విక్రయాలకు సన్నద్ధమవుతున్నారు. ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారు. - 8లో

నేడు ఎచ్చెర్లలో అప్రెంటిస్‌షిప్ మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ఒకేషనల్‌లో పారా మెడికల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సోమవారం అప్రెంటిస్‌షిప్ మేళా జరగనుందని ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎచ్చెర్లలోని ఐటీఐ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ఈ మేళాను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వివిధ సంస్థల ప్రతినిధులు హాజరై అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని చెప్పా రు. అభ్యర్థులు తమ విద్యార్హతను తెలిపే సర్టిఫికెట్లు, రెండు పాస్ ఫొటోలు, ఆధార్‌కార్డుతో హాజరుకావాల్సి ఉంటుందని ప్రకాశరావు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

హాకీ చాంపియన్‌షిప్ అనకాపల్లి కైవసం



ప్రథమ స్థానంలో నిలిచిన అనకాపల్లి జట్టు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పాత్రునివలసలో గల మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో టిక్కం కిశోర్‌కుమార్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వహించిన 14వ హాకీ ఏపీ జూనియర్స్ ఉమెన్ చాంపియన్‌షిప్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచారు. అనకాపల్లి ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో శ్రీసత్యసాయి, తృతీయ స్థానంలో అనంతపురం నిలిచాయి. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి షీల్డ్‌తో పాటు మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎంవీ పద్మావతి, శ్రీకాకుళం జెడ్పీటీసీ రుప్పదివ్య, అల్లు లక్ష్మీనారాయణ, బాణాల గాంధీ, కోచ్ అల్లు అనీల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

అరసవల్లిలో మాఘ మాస సందడి



ఆలయ ప్రాంగణంలో భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మాఘమాస సందడి మొదలైంది. తొలి ఆదివారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంద్రపుష్కరిణిలో నీటిని తోడేయడంతో ప్రత్యామ్నయంగా ఏర్పాటు చేసిన కుళాయిల వద్ద స్నానాలు చేసి పుష్కరిణి ఒడ్డునే మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పిడకల పొయ్యిపై పాలను పొంగించి క్షీరాన్నాన్ని ప్రసాదంగా స్వామికి నివేదించారు. భక్తులకు ఉచిత మంచినీరు, ప్రసాదాలను పంపిణీ చేయడంతో పాటు అన్నప్రసాద భోజనాన్ని కల్పించేలా ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు చర్యలు చేపట్టారు. అలాగే అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్వామి మూలవిరాట్టును అలంకరించి పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచే సర్వదర్శనాలకు అనుమతించారు. దీంతో వందలాది మంది భక్తులు మాఘ మాసంలో తొలిదర్శనాన్ని చేసుకున్నారు. ఇక ఒక్క ఆదివారంలో వివిధ దర్శనాల మార్గాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,05,200, విరాళాలు, ఆర్జిత సేవల ద్వారా రూ.1,33,521, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.30 లక్షల ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ తెలిపారు.

ప్రశాంతంగా ప్రాక్టికల్ పరీక్షలు



ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థినులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఆదివారం ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి ఫేజ్‌లో 94 కేంద్రాల్లో జరుగుతున్న ప్రాక్టికల్ పరీక్షలకు ఆదివారం తొలిరోజు 7608 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. వివిధ కారణాలతో 179 మంది గైర్హాజరయ్యారు. 7429 మంది హాజరయ్యారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్, డీవీఈఓ కోట ప్రకాశరావు టెక్కలి, కోటబొమ్మాళి తదితర ప్రాంతాల్లోని కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లా ఆర్ఐఓ/డీఈసీ కమిటీ కన్వీనర్ ప్రగడ దుర్గారావు, డీఈసీ కమిటీ ప్రతినిధులు ఎయిమ్స్, శ్రీచైతన్య, శ్రీకాకుళం బాలికలు, తదితర కళాశాలల్లో తనిఖీ చేశారు.

అంతా ఆన్‌లైన్‌లోనే..

ప్రాక్టికల్ పరీక్షల్లో అందుబాటులో ఉన్న సాంకేతికతను ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ ఇంటర్మీడియెట్ బోర్డు అందిపుచ్చుకుంది. నామినల్ రోల్స్, బ్యాచ్‌ల కేటాయింపు, విద్యార్థుల హాల్ టిక్కెట్లు, ఎగ్జామినర్ల నియామక ఉత్తర్వులతో పాటు క్వశ్చన్ పేపర్ మొదలుకుని.. విద్యార్థులు సాధించిన మార్కులు అప్‌లోడ్ చేసే వరకు ప్రతీది ఆన్‌లైన్‌లోనే పూర్తిచేస్తున్నారు. జ్ఞానభూమి వెబ్‌పోర్టల్ బీఐఈఏపీ సర్వీసెస్‌లో అత్యంత పారదర్శకంగా పని పూర్తి చేస్తున్నారు.



- టీడీపీ హయాంలో జరిగిన అక్రమాలను మర్చిపోయిన లోకేష్
- అధికారంలో ఉండగా అభివృద్ధి గాలికొదిలేసిన వైనం
- వైఎస్సార్‌సీపీ వచ్చాకే జిల్లాలో జోరందుకున్న ప్రగతి

గతమును మరిచి..
జనులను ఏమార్చి



నీరు–చెట్టు పేరుతో టీడీపీ చేసిన దోపిడీ ఇంకా జనాలకు గుర్తుంది. జన్మభూమి కమిటీల దౌర్జన్యం ఎవరూ మర్చిపోలేదు. మాటిచ్చి మర్చిపోయే పచ్చ నేతల నైజానికి నిదర్శనంగా ఎన్నో శిలాఫలకాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా అభివృద్ధిని గాలికి వదిలేసి సొంత జేబులు నింపుకున్న వైనాలు కథలు కథలుగా జనంలోనే వినిపిస్తున్నాయి. కానీ టీడీపీ నాయకుడు లోకేష్ ఇవన్నీ మర్చిపోయారు. జిల్లాను మళ్లీ ఏమార్చడానికి శంఖారావం అంటూ సిద్ధమైపోయారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : గతంలో ఇచ్చిన హామీలు మర్చిపోయి.. చేసిన అవినీతిని విస్మరించి టీడీపీ నాయకుడు లోకేష్ కొత్త హామీలు ఎత్తుకున్నారు. జిల్లా పర్యటనలో ఆయన ఇష్టానుసారం హామీలు ఇవ్వడం ప్రారంభించారు. కానీ ఇప్పటికే వైఎస్సార్‌సీపీ చాలా వరకు పనులు పూర్తి చేసిన సంగతి ఆయన తెలీడం లేదు. అధికారంలో ఉండగా టీడీపీ నాయకులు అభివృద్ధి పక్కన పెట్టేసి అవినీతి పనులతో కాలక్షేపం చేశారు. వైఎస్సార్ సీపీ వచ్చాక గానీ జిల్లాలో ప్రగతి పనుల కు మోక్షం లభించలేదు. ఇప్పుడు ఎన్నికల వేళ శంఖారావం పేరుతో అబద్ధాలు వల్లించేందుకు లోకేష్ శ్రీకారం చుట్టారు.

వైఎస్ జగన్ హయాంలో ప్రగతి పరుగులు



నరసన్నపేట నియోజకవర్గంలో..

- నేరడికి ప్రత్యామ్నాయంగా గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పనులు జోరుగా జరుగుతున్నాయి. రూ. 170కోట్లతో పనులు చేస్తున్నారు.
- 91 సచివాలయాలు, 91 ఆర్‌కేబీ, 71 హెల్త్ క్లినిక్‌లను నియోజకవర్గంలో కొత్తగా కట్టారు.
- నియోజకవర్గంలో గడిచిన నాలుగేళ్లలో రూ. 24కోట్లతో పంచాయతీ రాజ్ కింద 50 కిలో మీటర్ల పరిధిలో సీసీ రోడ్లు నిర్మించారు. రూ. 52కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లు అభివృద్ధి చేశారు.
- ఎనిమిది పీహెచ్‌సీలను బాగు చేయడమే కాకుండా నరసన్నపేటలోని వంద పడకల ఆస్పత్రిని రూ.12.8 కోట్లతో ఆధునికీకరిస్తున్నారు.
- జలుమూరు మండలం కొమ్మనాపల్లిలో రూ. 42కోట్లతో కీలకమైన వంతెన కట్టారు.
- రూ. 50కోట్లతో చల్లపేటలో జగనన్న లేవుట్‌ను మోడల్ కాలనీగా నిర్మించారు.
- 3200 మంది పేదలకు ఇళ్లు కట్టించడంతో పాటు నరసన్నపేట టౌన్‌లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు.



చల్లపేటలో జగనన్న కాలనీ



శ్రీకాకుళం నియోజకవర్గంలో

- జిల్లా కేంద్రంలో రూ.39.27కోట్లతో 272 రహదారులు నిర్మించారు.
- రూ. 10కోట్లతో నగరంలో 15పార్కులను, చెరువులను ఆధునికీకరించారు.
- నాలుగు కోట్లతో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు కట్టారు.
- బలగలో ఉన్న మంచినీటి ప్రాజెక్టును 5ఎంఎల్‌డీ అదనపు సామర్థ్యంతో నీరు సరఫరా చేసేందుకు రూ. 2.50కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.
- వాటర్ సప్లై ప్రాజెక్టు కింద పెదపాడు, పాత్రునివలసలో రూ. 23కోట్లతో భారీ ప్రాజెక్టును మంజూరు చేశారు.
- టీడీపీ ప్రభుత్వం సగంలో వదిలేసిన టిడ్కో ఇళ్లను సుమారు రూ. 20కోట్లతో నిర్మించి మౌలిక వసతులు కల్పించారు.
- రూ.40 కోట్లతో శ్రీకాకుళం అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఆమదాలవలస బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి.
- ఫిష్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పాలిటెక్నిక్ కళాశాల రోడ్డులో 26 షాపులను ఏర్పాటు చేశారు.



ఆమదాలవలస నియోజకవర్గంలో..

- వెన్నెలవలసలో వెటర్నరీ పాలిటెక్నికల్ కాలేజీ, తొగరాంలో అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కాలేజీ, పెద్దపేటలో హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్, పొందూరులో డిగ్రీ కళాశాల, తొగరాంలో డిగ్రీ కళాశాల, పొందూరులో ఎంజేపీ స్కూల్ ఏర్పాటు చేశారు.
- ఆమదావలస జగ్గు శాస్త్రులపేట వద్ద క్రికెట్ స్టేడియం మంజూరు చేశారు.
- పొందూరులో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేశారు.
- రూ. 87కోట్లతో బలసలరేవు బ్రిడ్జి నిర్మాణ పనులు మంజూరు చేశారు.
- మడ్డువలస రెండో దశ పనులకు రూ. 26.90కోట్లు మంజూరుచేశారు.
- ఆమదాలవలస రూరల్‌లో ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియం మంజూరు చేశారు.
- నియోజకవర్గంలో 12 ఎత్తిపోతల పథకాల నిర్మాణం.
- రూ. 28కోట్లతో పొందూరు రైల్వే బ్రిడ్జి, రూ.48కోట్లతో అలికాం–ఆమదాలవలస మధ్యలో రైల్వే బ్రిడ్జి నిర్మాణం తలపెట్టారు.
- గ్రేడ్ 2మున్సిపాలిటీ ఆమదాలవలసను అప్‌గ్రేడ్ చేశారు.
- కణుగులవలస రోడ్డు పూర్తి చేసి 20 గ్రామాల ప్రజల కష్టాలు తీర్చారు.

బాబుదంతా బడాయే..

- శ్రీకాకుళం స్మార్ట్ సిటీ చేస్తామన్నారు. భూగర్భ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు అన్నీ అబద్ధాలుగా తేలాయి.
- నరసన్నపేటలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి హామీ ఇచ్చి గాలికొదిలేశారు.
- ఆమదాలవలసలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. కానీ చేయలేదు.
- కళింగపట్నంలో ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేస్తామన్నారు. కానీ చేతులెత్తేశారు.
- గార మండలంలోని కె.మత్స్యలేశంలో ఏకైక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శంకుస్థాపన చేసి వదిలేశారు. వైఎస్సార్ సీపీ వచ్చాక పనులు పూర్తయ్యాయి.
- పొన్నాం నుంచి కళింగపట్నం వరకు నారాయణ కుడి కాలువ పనులు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ పనులు చేయలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మంత్రి ధర్మాన ప్రసాదరావు పనులు పూర్తి చేశారు.
- శ్రీకాకుళం రూరల్‌లో నర్సింగ్ మెడికల్ కళాశాల హాస్టల్ భవనం నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి, కొన్ని పనులు చేపట్టి గాలికొదిలేశారు. ఆ భవన నిర్మాణం చేసే బాధ్యతను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకుంది. దాదాపు రూ. 12కోట్లతో మిగతా పనులు పూర్తి చేసింది.
- టీడీపీ హయాంలో 2018లో తాడివలస వద్ద రెల్లిగెడ్డపై చెక్‌డ్యామ్ నాసిరకంగా నిర్మించడంతో నాలుగు నెలలకే కొట్టుకుపోయింది.

ఆ ఐదేళ్లు తారస్థాయికి అవినీతి



- నరసన్నపేట నియోజకవర్గంలోని మడపాం దగ్గర నుంచి రోజుకి నాలుగైదు వందల లారీల ద్వారా ఇసుక తరలించారు.
- నాటి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అనుచరులు భారీగా వసూలు చేశారు.
- నరసన్నపేట మండలం లుకలాంలో 2016లో అక్రమ ఇసుక తవ్వకాలు, ఇసుకను గుర్తించిన నాటి ఆర్డీవో దయానిధి, డీఎస్పీ భార్గవనాయుడు, అప్పటి మైన్స్ ఏడీలు లుకలాం మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు చేసేందుకు యత్నించగా, నాటి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అడ్డుకున్నారు. గోపాలపెంట, మడపాంలో జన్మభూమి కమిటీ సభ్యులు, నాటి ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున దందా నడిపారు.
- ఆమదాలవలస నియోజకవర్గం పురుషోత్తపురం ఇసుక ర్యాంపులోకి కూన రవికుమార్ అండ్ కోకు చెందిన 25లారీలతో పాటు నాలుగు జేసీబీలు అక్రమంగా వెళ్లి వరద పోటుకు మునిగిపోయిన విషయం అప్పట్లో చర్చనీయాంశమైంది.
- పొందూరు మండలం సింగూరు పేరుతో అనుమతులు ఇచ్చిన ర్యాంపును చూపించి నాగావళికి అవతల ఇసుక తవ్వేసి దూసి గ్రామం మీదుగా అక్రమ రవాణా చేయించారు.
- శ్రీకాకుళం విశాఖ ఏ కాలనీ, దీపామహల్ వెనక దుర్గాదేవి గుడి గుండా వెళ్లే మార్గంలో మిర్తిబట్టి సగభాగాన్ని ఒక టీడీపీ నాయకుడు ఆక్రమించి, మూడు అంతస్తుల భవనం నిర్మించి, హాస్టల్ నడిపారు.
- బలివాడ గ్రామంలో రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని, కిల్లిపాలెం పంచాయతీ పరిధిలో గల రామిగెడ్డను టీడీపీ నాయకులు ఆక్రమించారు.
- మునసబుపేటలో ల్యాండ్ సీలింగ్ భూములను, సింగుపురంలో డీ పట్టా భూములను ఆక్రమించారు.
- చాపురంలో టీడీపీ నాయకుడు స్థలంలో లేఅవుట్ వేసుకుని, ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్డు వేయించుకున్నాడు.
- హుద్‌హుద్, టిడ్కో ఇళ్ల స్కామ్‌ను ఆ పార్టీ నాయకులే బయటపెట్టారు.

లోకేష్ తప్పుడు స్క్రిప్టు చదువుతున్నారు

- కోటీ డబ్బైఐదులక్షల ఉపాధ్యాయ పోస్టులు ఎలా ఇచ్చారు.?
- ధ్వజమెత్తిన మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ఎన్టీఆర్, చంద్రబాబు కలిసి కోటీ డబ్బై ఐదు లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చారని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ అనడం విస్మయానికి గురి చేసిందని పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పలాసలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన డిగ్రీ కళాశాలకు ముందుగానే భవనాలు నిర్మించామని చెప్పడం, ఆయన మంత్రిగా ఉన్నప్పుడు శ్రీకాకుళం పట్టణంలో ఐటీ నిర్మాణానికి భూములు కేటాయించామని అనడం, పలాసలో మధ్యలో వదిలేసిన టిడ్కో ఇళ్లు జగనన్న పూర్తి చేస్తే తామే పూర్తి చేశామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఆయనకు తప్పుడు స్క్రిప్టు అందించిన వారికి కూడా సిగ్గు లేదని అన్నారు. ఎంపీ పక్కనే ఉన్నా నిజాలు చెప్పలేదని చురకలు అంటించారు. చంద్రబాబు హయాంలో చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఉత్తరాంధ్రలో జరిగిన పనులు లోకేష్‌కు కనిపించడం లేదన్నారు. గంజాయి క్యాపిటల్ అన్న మాటకు బదులిస్తూ అయ్యన్నపాత్రుడి కొడుకే గంజాయి అమ్ముతున్నాడని అన్నారు. ముఖ్యమంత్రి గంజాయిని ఏరిపారేయడానికి పరివర్తన 2.0 ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర వెనుకబడిందని లోకేష్ అంటున్నారని, పదేళ్లు గేళ్ల చంద్రబాబు పాలన చేసిన నిర్వాకమిదని దుమ్మెత్తిపోశారు. ఎర్రబుక్ చూపించి అధికారులకు, ఇతరుల పేర్లు రాస్తున్నామని బెదిరిస్తున్నారని అదో ఎర్రి బుక్ అని అన్నారు. లోకేష్ సీరియస్ డైలాగులు వేస్తుంటే బ్రహ్మానందం చెప్పినట్లు ఉందని అన్నారు. గౌతు శిరీష కుటుంబంలో అందరి పేరున వందల ఎకరాలు ఉన్నాయని, బినామీల పేరిట ఇంకా ఉన్నాయని ఆరోపించారు. పలాసలో జరిగిన అభివృద్ధిని చూడలేక లోకేష్ దొడ్డి దారిన పలాస దాటేశారని అన్నారు.

వెనక్కి వెళ్లిన సముద్రం



అక్కుపల్లి శివసాగర్ తీరంలో వెనక్కి వెళ్లిన సముద్రం

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఆదివారం మధ్యాహ్నం వింత పరిణామం చోటుచేసుకుంది. తీరంలో సముద్రం ఒక్కసారిగా సుమారు 50 మీటర్లు వెనక్కి వెళ్లడంతో స్థానిక మత్స్యకారులు, పర్యాటకులు ఆశ్చర్యానికి గురయ్యారు. వాతావరణంలో పలు మార్పులు చోటుకుంటున్న తరుణంలో ఇలా సముద్రం వెనక్కి వెళ్లడంపై మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు.

'లోకేష్ నోరు అవాస్తవాల పుట్ట'



నరసన్నపేట: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నోరు పెద్ద అబద్ధాల పుట్ట అని, శంఖారావ యాత్ర అట్టర్ ఫ్లాప్ కావడంతో మతి చెడి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఉత్తరాంధ్ర నుంచి శంఖారావం పేరుతో లోకేష్ చేస్తున్న యాత్ర టీడీపీ శవయాత్ర అని ఆయన అన్నారు. ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పైనా లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మంచి జరిగితేనే ఓటు వేయండి అని చెప్పే మా జగనన్నకి తన జీవితంలో ఏనాడూ ఒంటరిగా పోటీ చేయలేక పొత్తుల కోసం వెంపర్లాడుతున్న చంద్రబాబుకు నక్కకూ నాక లోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. చంద్రబాబు పొత్తుల కోసం ఢిల్లీ వెళితే, సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రయోజనాల కోసం వెళ్లారని అన్నారు. టీడీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మీ కుట్రలు, కుతంత్రాలు సాగవని పేర్కొన్నారు.

పాడిన పాటే పాడుతూ..

- నిస్సారంగా లోకేష్ శంఖారావం
- పసలేని ప్రసంగానికి ఖాళీ కుర్చీలే సాక్ష్యం
- నిట్టూర్చిన టీడీపీ శ్రేణులు





ఇచ్ఛాపురంలో దర్శనమిచ్చిన ఖాళీ కుర్చీలు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న లోకేష్

కంచిలి, పలాస, టెక్కలి: సభల్లో ఖాళీ కుర్చీలు, ప్రసంగాల్లో 'సంకారావాలు', విమర్శల్లో కనిపించని ఆధారాలు.. కలగలిపి నారా లోకేష్ శంఖారావం మొదటి రోజే అభాసుపాలైంది. ఇచ్ఛాపురం సురంగి రాజావారి మైదానంలో ఆదివారం శంఖారావం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒకప్పుడు ఇదే ప్రాంతానికి వచ్చి ఇచ్చిన హామీలు మర్చిపోయి మళ్లీ కొత్తగా గంపెడు హామీలు ప్రకటించారు. ఇచ్ఛాపురంలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, కొబ్బరి రైతులు, మత్స్యకారులను ఆదుకుంటామని తెలిపారు. జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, పరిశ్రమలను ఆదుకుంటామని చెప్పారు. అయితే ఇచ్ఛాపురంలో స్థానిక టీడీపీ నేతలకు ప్రాధాన్యత కల్పించకపోవడం, జనసేన శ్రేణులను సభలోపలకు రానివ్వకపోవడంతో వాగ్వాదాలు జరిగాయి. లోకేష్ ప్రసంగిస్తున్నప్పుడు జనం లేచి వెళ్లిపోవడంతో కుర్చీలు ఖాళీ అయిపోయాయి. అనంతరం పలాస సమీపంలోని కంబిరిగాం కూడలి వద్ద ఆదివారం సాయంత్రం సభ నిర్వహించారు. స్థానిక మంత్రి డాక్టరు సీదిరి అప్పలరాజుపై అనేక రకాలుగా ఆరోపణలు చేశారు. ఇక్కడ కార్యకర్తలకు పెట్రోల్‌కూపన్లు పంచడం విశేషం. అలాగే స్టేజీ ముందు నాయకులు సెక్యూరిటీ సిబ్బంది దెబ్బలాడుకున్నారు. టెక్కలి సభలో ఆద్యంతం రెడ్‌బుక్ చూపిస్తూ లోకేష్ ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అత్యధికంగా కేసులు నమోదు చేసుకున్న టీడీపీ కార్యకర్తలకే నామినేటెడ్ పదవులు ఇస్తామంటూ ఆఫర్ ఇచ్చారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు చేసిన కక్ష సాధింపు చర్యలను రెడ్‌బుక్‌లో నమోదు చేయాలని ఆవేశంతో ఊగిపోయారు. ఇక్కడ సుమారు 5 గంటల సమయంలో సభ వద్దకు వచ్చినప్పటికీ కార్యకర్తలు పెద్దగా లేకపోవడంతో 6 గంటల వరకు కార్యక్రమాన్ని ప్రారంభించలేదు. కార్యకర్తలకు బహిరంగంగానే రూ.500, రెండు క్వార్టర్ బాటిళ్లు పంపిణీ చేశారు.



టెక్కలిలో ఖాళీగా సభా ప్రాంగణం

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని ఈఓ రమేష్‌బాబుకు అందజేస్తున్న దాత నగేష్, ఉష దంపతులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖ వాస్తవ్యులు బి.వెంకటవ్యాస నగేష్, ఉష దంపతులు ఆదివారం ఉదయం రూ.1,00,116 విరాళాన్ని ఈఓ రమేష్‌బాబుకు అందజేశారు. ఈ మేరకు ఈఓ స్పందిస్తూ రూ.లక్ష, అంతకు మించి విరాళాలిచ్చిన దాతలకు ఏటా రథసప్తమి వంటి పర్వదినాల్లో డోనర్ పాసులను అందజేస్తామని ప్రకటించారు. అనంతరం నిత్యాన్నదాన రశీదును దాతలకు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు కిరణ్‌శర్మ తదితరులున్నారు.

కమ్మసిగడాం జాతర పోస్టర్ ఆవిష్కరణ



కమ్మసిగడాం జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రణస్థలం: ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్వహించే కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి జాతర వాల్ పోస్టర్‌ను ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు, సభ్యులు కమ్మసిగడాం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 16న రథసప్తమి శుక్రవారం ఉదయం 8గంటలకు శుభరాట వేస్తామని, వ్యాపారస్తులు ముందుగా వచ్చిన వ్యాపార స్థలాలు బాగు చేసుకోవాలని సూచించారు. పోస్టర్ ఆవిష్కరణలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, సభ్యులు రాజా రవీంద్ర, తేజ, రాజశేఖర్, మన్నె లక్ష్మి ప్రసాద్, సింహాచలరాయుడు, కృష్ణారావు, చినబాబ, బాబి తదితరులు ఉన్నారు.

నదిలో పడి వ్యక్తి మృతి



నీటిలో ఉన్న జగ్గునాయుడు మృతదేహం

గార: మండల కేంద్రంలోని వంశధార నదిలో నిర్మాణ దశలో ఉన్న బ్రిడ్జి వద్ద కుమ్మరిపేట గ్రామానికి చెందిన మళ్ల జగ్గునాయుడు (86) కాలు జారిపడి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం జగ్గునాయుడు ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కాలకృత్యం కోసం నది వద్దకు వెళ్లారు. ఆ ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండటంతో కాలుజారి పడిపోయారు. మృతదేహంపైకి తేలిన తర్వాత స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ కె. కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు తమ్ముడు మళ్ల కృష్ణారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీశయన సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీశయనుల అభివృద్ధే తమ లక్ష్యమని శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్ అన్నారు. శ్రీకాకుళంలోని శ్రీశయన భవన్‌లో జిల్లా శ్రీశయన సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి లోడ అప్పారావు, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షులు లోడ అప్పారావు ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్ర శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్ మాట్లాడుతూ సంఘం స్థాపించిన నాటి నుంచి నేటి వరకు ఎన్నో మంచి పనులు చేశామన్నారు. జిల్లా అధ్యక్షుడు మెండ లాల్ బహదూర్ శాస్త్రి, కార్యదర్శి గూరు జగదీష్ (అబ్బు), ట్రెజరర్‌గా బి.కోటేశ్వరరావు, యువజన అధ్యక్షులుగా గొండు నీలాద్రి, కార్యదర్శి గుజ్జల అప్పలరాజు, మహిళా అధ్యక్షురాలు మంగి జగదాంబ, కార్యదర్శి గుజ్జల పద్మతో పాటు మరో 30మందిని కార్యవర్గసభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణ సమీపంలోని లక్ష్మడిపేట గ్రామంలో ఆదివారం రాత్రి ఆమదాలవలస ఎస్‌ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో ముగ్గురు జూదరులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పేకాట ఆడుతున్న వారికి పోలీసుల రాక తెలిసిపోవడంతో కొందరు పరారైనట్లు సమాచారం. పోలీసులు ముగ్గురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.23,520 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ప్రమాదాల నివారణే ధ్యేయం

- రహదారి భద్రతపై విస్తృతంగా ప్రచారం
- 'సాక్షి'తో డీటీసీ చంద్రశేఖర రెడ్డి



రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) డీటీసీ చంద్రశేఖర రెడ్డి

సాక్షి ఇంటర్వ్యూ

శ్రీకాకుళం రూరల్: రహదారి భద్రతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న చోట్ల బ్లాక్‌స్పాట్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మరికొన్ని విషయాలు ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు.

సాక్షి: ఆర్టీఓ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రవర్తనపై చాలా ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై మీ స్పందన?

డీటీసీ: నా దృష్టికి రెండు మూడు ఫిర్యాదులు వచ్చాయి. ఒకసారి ఆర్టీఓ కార్యాలయ సిబ్బందితో మాట్లాడతాం. పనుల మీద వచ్చిన వారితో మర్యాదగా మసలుకోవాలని స్పష్టంగా చెబుతాను.

సాక్షి: మీరు చిన్నస్థాయి నుంచి మొదలుపెట్టి అంచెలంచెలుగా ఈ స్థాయికి ఎలా చేరుకున్నారు?

డీటీసీ: నేను 1994లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లోకి వచ్చాను. నాలుగేళ్లు పూర్తయ్యాక 1998లో ఎంవీఐగా కొన్నేళ్లు పనిచేశాను. 2019లో ఆర్టీఓగా గుడివాడ, ఒంగోలులో పనిచేశాను. 2022లో డీటీఓగా బాపట్లలో పనిచేశాను. 2024 జనవరిలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా శ్రీకాకుళంలోనే బాధ్యతలు తీసుకున్నా.

సాక్షి: ఏపీలో ఒకే ఒక్క డీటీసీగా ఉన్నందుకు ఎలా భావిస్తున్నారు?

డీటీసీ: చాలా సంతోషంగా ఉంది. మా బ్యాచ్ (1994)లో 156 మంది అసిస్టెంట్ ఎంవీఐగా అప్పట్లో విధుల్లోకి వచ్చాం. చాలామంది వివిధ కారణాలు, కేసులతో ఇప్పటికీ కుస్తీ పడుతున్నారు. కానీ ఏపీ మొత్తంగా ఎలాంటి కేసులు లేకుండా ఏకధాటిగా 30 ఏళ్లు ప్రజలకు మంచి సర్వీస్‌ను అందిస్తూ ప్రస్తుతం శ్రీకాకుళం డీటీసీగా పదోన్నతిపై జాయినింగ్ అవ్వడం చాలా గర్వంగా ఉంది.

సాక్షి: రహదారి భద్రతపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

డీటీసీ: డిస్ట్రిక్ట్ రోడ్డు సేఫ్టీ యంత్రాంగం నడుస్తోంది. ప్రస్తుతం కొత్తగా బాధ్యతలు తీసుకున్నాను కాబట్టి జిల్లాపై మరింత పట్టు రావాల్సి ఉంది.

సాక్షి: రోడ్ సేఫ్టీలో డిస్ట్రిక్ లీడ్ ఏజెన్సీ పాత్ర ఎలా ఉండనుంది?

డీటీసీ: డిస్ట్రిక్ట్ లీడ్ ఏజెన్సీని ఒక గ్రూప్‌గా ఏర్పాటు చేశాం. ఇందులో ఆర్టీఓ ప్రధానాధికారిగాను, ఒక ఎస్‌ఐ, ఒక ఎంవీఐ ఉంటారు. జిల్లాలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే వీరు ముందుగా ఆ ప్రాంతాన్ని పర్యవేక్షించి దానికి కారణాలు తెలుసుకుంటారు. దీనికి గాను జిల్లా ఉపరవాణాశాఖాధికారి వారి కార్యాలయంలో ఒక ప్రత్యేకమైన సెల్ నడుస్తోంది.

సాక్షి: ఐరాడ్ యాప్ కోసం వివరిస్తారా?

డీటీసీ: ఐరాడ్ అంటే ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్ యాప్. ఇది సెంట్రల్ గవర్నమెంట్ తయారు చేసింది. దేశంలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే పోలీసులు, రవాణా శాఖాధికారులు స్పాట్‌కు వెళ్తారు. వెంటనే ప్రమాదపు తీరు, కారణాలతో ఫొటోలు తీసి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. పోలీస్, ట్రాన్స్‌పోర్టు, మెడికల్ అండ్ హెల్త్, ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్ అధికారుల భాగస్వామ్యంతో ఇది నడుస్తోంది.

సాక్షి: గుడ్ సమారిటన్ అంటే ఏమిటి?

డీటీసీ: గుడ్ సమారిటన్ అనేది సెంట్రల్ గవర్నమెంట్ స్కీమ్. ఎక్కడైనా ప్రమాదం జరిగితే వెంటనే అందుబాటులో ఉన్న వ్యక్తి ప్రమాదానికి గురైన వ్యక్తిని ఆస్పత్రిలో చేర్చి ప్రాణాలు కాపాడితే కాపాడిన వ్యక్తికి రూ.5వేలు పారితోషికం కలెక్టర్ చేతులమీదుగా అందజేస్తారు. దీనిపై అవగాహన కల్పిస్తున్నాం.

సాక్షి: డ్రంక్ అండ్ డ్రైవ్ చట్టంలో ఏమైనా మార్పులు చోటుచేసుకున్నాయా?

డీటీసీ: ఆరు నెలల జైలు శిక్ష లేదా పదివేల జరిమానా ప్రస్తుతం అమలులో ఉంది. రానున్న రోజుల్లో చట్టం మరింత కఠినమవుతుంది.

సాక్షి: వాహన్, సారథి యాప్‌లు ఎలా పని చేస్తున్నాయి?

డీటీసీ: వాహన్, సారథి అనే యాప్‌లు వాహన్ పరివార్‌కు అనుసంధానమైనవి. వీటిని ఆన్‌లైన్ విధానం ద్వారా చేసుకోవాలి. ఇప్పటికే వాహన్ యాప్ గురించి డీలర్స్ అందరితో రిజిస్ట్రేషన్ చేయించాం. సారథి యాప్ ద్వారా లెర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, స్లాట్ బుకింగ్స్ జరుగుతున్నాయి.

సాక్షి: జిల్లాలో డ్రైవింగ్ స్కూల్ ఎక్కడైనా ప్రారంభించే అవకాశాలు ఉన్నాయా?

డీటీసీ: ఇప్పటికే ఎచ్చెర్ల పరిసర ప్రాంతంలో పదెకరాల్లో స్థల సేకరణ జరిగింది. ఎల్‌ఎల్‌ఆర్‌లు, డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు చేస్తున్నాం. ప్రస్తుతం ఒక తాత్కాలిక భవనంలోనే పనులు చేస్తున్నాం. ఇక్కడే ఆటోమేషన్ టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు టెండర్‌లు కూడా పూర్తయ్యాయి.

సాక్షి: లైఫ్ అయిపోయిన బళ్ల పరిస్థితి ఏంటి?

డీటీసీ: ద్విచక్ర వాహనాలతో పాటు ప్రతి ప్రభుత్వ వాహనం బండి ఏదైనా లైఫ్ పీరియడ్ కేవలం 15 ఏళ్లు మాత్రమే. తర్వాత రెన్యువల్ చేసుకుంటే మరో ఐదేళ్లు వస్తుంది. కానీ ఇది ప్రైవేట్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది. ప్రభుత్వ వాహనాలకు వర్తించదు. లైఫ్ అయిపోతే స్క్రాప్‌లో అమ్మేసి ఆ పార్టులను ఫొటోలు తీసి రవాణాశాఖకు ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయాలి. తరువాత రిజిస్ట్రేషన్ కేన్సిల్ అవుతుంది.

టికెట్ల విక్రయాలకు సన్నద్ధం

- ఆదిత్యాలయ ఈఓ రమేష్‌బాబు



డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లిలో ఈనెల 16న లక్షలాది మంది భక్తుల నడుమ భారీగా రథసప్తమి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా శరవేగంగా ఏర్పాట్లు చేపడుతున్నామని శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయ ఈఓ/డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్ బాబు తెలిపారు. ఆయన ఆదివారం 'సాక్షి'తో మాట్లాడారు. ఆలయానికి వివిధ రూపాల్లో రూ.లక్షకు మించిన విలువైన విరాళాలు అందించిన దాతలకు ప్రత్యేకంగా దాతల పాసులను (డోనర్) ఈనెల 13 నుంచి 15వ తేదీ సాయంత్రంలోగా అందజేస్తామని తెలిపారు. ఆలయానికి ఈనెల 15వ తేదీ వరకు ఎవరైనా దాతలు రూ.లక్ష లేదా అంతకుమించి విరాళాలు ఇవ్వవచ్చునని, వీరందరికీ దాతల పాసులను అందజేస్తామని చెప్పారు. అలాగే వీఐపీ టికెట్లకు టైమ్ స్లాట్ అమలు చేస్తున్నామని, మొత్తం మూడు వేల టిక్కెట్లను అరసవల్లిలో యూనియన్ బ్యాంకులో ఈనెల 14వ తేదీ నుంచి విక్రయించనున్నామని చెప్పారు. రథసప్తమి నాడు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు వీఐపీ టిక్కెట్ల దర్శనాలకు అనుమతి ఉంటుందని వివరించారు. వీఐపీ భక్తులు తప్పనిసరిగా కేటాయించిన స్లాట్ టైమ్‌లోనే ప్రత్యేక క్యూ ద్వారానే స్వామి దర్శనాన్ని చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సుమారు 50 వేల వరకు పులిహోర ప్యాకెట్లు, లక్ష వరకు లడ్డూలను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అరసవల్లి మిల్లు కూడలి నుంచే భక్తుల వాహనాలు నిలిపివేసే ప్రక్రియ గతంలో జరిగిందని, అయితే ఈసారి ప్రత్యేక వాహనాలు కాకుండా స్కూల్ బస్సులను ట్రిప్‌లుగా సింహద్వారం వరకు డ్రాప్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని, అయితే దీనిపై ఒకటెండ్రు రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. ఉత్సవానికి చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ)గా దేవదాయ శాఖ ఇన్‌చార్జి రీజనల్ జాయింట్ కమిషనర్ విజయరాజును నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవం పూర్తయినంతవరకు ఈయన అరసవల్లిలో పర్యవేక్షించనున్నారు.

ఆగిన లారీని ఢీ కొన్న కారు

- ఒకరు మృతి



ప్రమాదానికి గురైన కారు



ప్రమాదంలో మృతిచెందిన గోపి

టెక్కలి రూరల్: స్థానిక అయ్యప్పనగర్ సమీప జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలుమూరు మండలం లింగాలపాడు పంచాయతీ పరిధి ఎర్రన్న పేట గ్రామానికి చెందిన బలగ గోపి(26) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మృతుడు గోపి తన దగ్గరి బంధువు పెళ్లి ఆదివారం జరుగుతుండటంతో ఆ పెళ్లికి వచ్చిన చుట్టాలను వారి గ్రామం దిగబెట్టేందుకు కారులో తురకలకోట వైపు వెళ్లాడు. అయితే వారిని అక్కడ దిగబెట్టి తిరిగి వస్తుండగా టెక్కలి సమీపంలోని అయ్యప్పనగర్ వద్దకు వచ్చేసరికి తన వాహనం ముందు వెళ్తున్న బండిని తప్పించే ప్రయత్నంలో రోడ్డు పక్కగా నిలిపి ఉన్న కంటైనర్ లారీని బలంగా ఢీకొన్నాడు. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయిపోగా అందులో గోపీ చిక్కుకుపోయాడు. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కున్న వ్యక్తిని బయటకు తీశారు. అయితే అప్పటికే ప్రాణాలు పోయాయి. అనంతరం అక్కడకు చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అప్పటి వరకు పెళ్లి పనుల్లో హుషారుగా పాల్గొన్న కుర్రాడు చనిపోయాడని తెలియడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లి అప్పమ్మ ఉన్నారు. తండ్రి కూడా గతంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు.

వారు కళ్లున్నా చూడలేరు



గ్రామ సచివాలయం ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: ఈ ప్రభుత్వాన్ని విమర్శించే వాళ్లు కళ్లున్నా చూడలేని వారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. మండల పరిధిలోని సానివాడ గ్రామంలో రూ.80లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు యాక్టర్లు వలంటీర్లను ఎందుకు విమర్శిస్తున్నారో అర్థం కాదని, వలంటీర్లు చేస్తున్న సేవ పక్క రాష్ట్రాలకు అర్థమవుతోందన్నారు. ఈ ఐదేళ్లలో ఎన్నో పనులు చేసి చూపించామని, ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదన్నారు. కిడ్నీ బాధితుల కోసం రూ.200 కోట్లతో డయాలసిస్ సెంటర్‌ను పలాసలో నిర్మించామని, ఉద్దాన ప్రాంతానికి రక్షిత మంచినీటి పథకం కట్టామని, రూ.4వేల కోట్లతో మూలపేట పోర్టు నిర్మాణాలు చేపట్టామన్నారు. అంతేకాకుండా బుడగట్లపాలెంలో రూ.350 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇన్ని చేశాం కాబట్టే ఓట్లు అడగగలమన్నారు. విపక్ష నేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ ప్రజలు వద్దకు ఏ ముఖం పెట్టుకుని వెళ్తున్నారని ప్రశ్నించారు. సచివాలయ ఉద్యోగాలు, వైద్యశాఖలో ఉద్యోగాలు తామే భర్తీ చేశామని గుర్తు చేశారు. గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మరో నాలుగు నెలల్లో పూర్తి చేస్తామన్నారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యువాత



అక్కుపల్లి శివసాగర్ తీరానికి కొట్టుకువచ్చిన అలివ్‌రిడ్లే తాబేళ్ల కళేబరాలు

వజ్రపుకొత్తూరు రూరల్: సముద్ర జీవుల్లో అరుదైన అలివ్ రిడ్లే తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. జిల్లాలో సువిశాలమైన సముద్రం తీరం ఉండటంతో ఆలివ్ రిడ్లే తాబేళ్లు అక్కుపల్లి, గుణుపల్లి, మెట్టూరు, మంచినీళ్లపేట, నువ్వలరేవు, భావనపాడు, దోకులపాడు తదితర తీరాలకు గుడ్లను పొదిగేందుకు వస్తుంటాయి. అయితే మత్స్యకారులు చేపల వేటకు వినియోగించే బోట్లు, వలలకు తగిలి అవి మృత్యువాత పడుతున్నాయి. అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో పదుల సంఖ్యలో తాబేళ్ల కళేబరాలు కనిపిస్తున్నాయి. తాబేళ్లను పరిరక్షించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ఎన్నికల విధులకు పోలీసులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో శ్రీకాకుళం సబ్‌డివిజన్ పోలీసులు

శ్రీకాకుళం రూరల్: రానున్న ఎన్నికల నేపథ్యంలో పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేలా శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని స్థాయిల్లోని పోలీసులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మండల పరిధిలో ఉన్న తండేవలసలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఎస్పీ జీఆర్ రాధిక ఆధ్వర్యంలో సబ్‌డివిజన్ల(శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ) వారీగా మూడురోజుల పాటు సాగే శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ముందు, అనంతరం అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసుల నమోదు అంశంలో జాగ్రత్తలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం విధులు నిర్వహించడంపై సూచనలు చేశారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించి అక్కడి పరిస్థితులపై అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. అక్రమ రవాణా జరిగే మద్యం, నగదుపై ఓ కన్నేసి ఉండాలని, ప్రాపర్టీ స్వాధీనంలో నిబంధనల మేరకు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో టౌన్ డీఎస్పీ శృతి, డీపీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, రూరల్ సీఐ సన్యాసినాయుడు, డీపీటీసీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



అడిషనల్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు వీలుగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. మబగాంలో రూ.1.25 కోట్లతో ఏర్పాటుచేయనున్న అడిషనల్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ వినియోగం గతంతో పోల్చితే చాలా ఎక్కువగా పెరిగిందన్నారు. అప్పటి అంచనాలతో వేసిన ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ బోర్లు, ఇతర వాడకం వల్ల నాణ్యమైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో అడిషనల్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, స్థానిక నాయకులు ధర్మాన లక్ష్మణదాస్, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు చింతు రామారావు, ట్రాన్స్‌కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి



ఆనంద్ (ఫైల్)

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల పంచాయతీ కొత్తముక్కాం గ్రామానికి చెందిన కుందు ఆనంద్(30) వేటకు వెళ్లి పడవ బోల్తా పడడంతో మృతి చెందాడు. గ్రామస్తులు, జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొత్తముక్కాం గ్రామానికి చెందిన ఆనంద్, మరో ముగ్గురు కుందు పోలిరాజు, మైలపల్లి పోతురాజు, కుందు అమ్మోరులు నలుగురు శనివారం మధ్యాహ్నం రెండు సమయంలో సముద్రంలోని మత్స్య వేటకు వెళ్లారు. తిరిగి సాయంత్రం 5గంటల సమయంలో వస్తుండగా ఒడ్డుకు చేరే క్రమంలో తెప్ప బోల్తా పడి ఆనంద్ ఇసుకలో కూరుకుపోయాడు. వెంటనే మిగిలిన ముగ్గురు ఒడ్డుకు చేర్చి 108 వాహనంపై శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి వివాహం కాలేదు. తల్లి రాములమ్మ, తండ్రి పోలీసు, ముగ్గురు అక్కలు ఉన్నారు. మృతుడి తండ్రి కుందు పోలీస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

'రహదారి నిబంధనలు పాటించాల్సిందే'



శ్రీకాకుళంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: ప్రమాద రహిత రవాణా అందరి బాధ్యత అని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ అన్నారు. ఆర్టీసీలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ శ్రీకాకుళం 1, 2వ డిపోల్లో గల ఆర్టీసీ సిబ్బందితో ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ కూడలి, డే - నైట్ జంక్షన్, విజయ గణపతి ఆలయం వరకు సాగింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాద రహిత రవాణా వ్యవస్థ తీసుకురావడానికి ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, రహదారి నిబంధనలను వాహనదారులు, పాదచారులు విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 2వ డిపో మేనేజర్ రవి శంకర్ శర్మ, శ్రీకాకుళం 1, 2వ డిపో సహాయ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.సన్యాసినాయుడు, ఎస్ఎం నరేంద్ర, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ భాషా తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం రైల్వే ట్రాక్‌పై ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అనంతరం రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు 35 ఏళ్లకు పైబడి ఉంటుందని, ఎరుపుగీతల చొక్కా ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుని వివరాల కోసం ఆరా తీస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు సూర్యనారాయణ(ఫైల్)

పీఎంపాలెం (విశాఖ): రోడ్డు దాటుతుండగా ఓ వ్యక్తిని ఆటో ఢీకొంది. ఆదివారం జరిగిన ఈ ఘటనలో ఆయన మృతి చెందారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ధర్మవరం పెద్దరపుపేటకు చెందిన సాధు సూర్యనారాయణ(55) 15 ఏళ్ల నుంచి కొమ్మాదిలో నివసిస్తున్నారు. అతను ఇక్కడ కూలి పనులు చేస్తుండగా.. అతని భార్య ఇల్లమ్మ స్వగ్రామంలో వ్యవసాయ పనులు చేస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో కొమ్మాది కూడలిలో జాతీయ రహదారి దాటుతుండగా.. కొమ్మాది రోడ్డు నుంచి హైవేపైకి వస్తున్న ఆటో డ్రైవర్ సూర్యనారాయణను బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్న అతన్ని సమీపంలోని గాయత్రి ఆస్పత్రికి తరలించగా.. అక్కడ ప్రాణాలు విడిచారు. అతనికి పిల్లలు లేరు. వరసకు మనవడు అయిన సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సినిమా ఆడిషన్స్‌కు విశేష స్పందన

శ్రీకాకుళం అర్బన్: ప్రముఖ హీరో చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ సినిమాలో నటించేందుకు ఆదివారం శ్రీకాకుళంలోని హోటల్ నాగావళిలో నిర్వహించిన సినిమా ఆడిషన్స్‌కు విశేష స్పందన లభించింది. ఆడిషన్స్ కోసం హాజరైన నటీనటులతో హోటల్ ప్రాంగణం కిక్కిరిసింది. ఉప్పెన సినిమా దర్శకుడు బుచ్చిబాబు ఈ ఆడిషన్స్‌కు పిలుపునివ్వడంతో జిల్లాలోని నటీనటుల నుంచి విశేష స్పందన లభించింది. ఆదివారం నుంచి మూడు రోజులపాటు ఈ ఆడిషన్స్ నిర్వహించనున్నారు. ఈ ఆడిషన్స్ మంగళ, బుధవారాల్లో కూడా ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ జరగనున్నాయి.